

ఢిల్లీలో కేరళ మాజీ గవర్నర్ సదాశివం చేతుల మీదుగా ఉత్తమ ఉద్యానవన రైతు అవార్డు అందుకుంటున్న రామచంద్రారెడ్డి

## ఉత్తమ ఉద్యానవన రైతుగా రామచంద్రారెడ్డి

- రామడుగు మండలం గోపాల్‌రావుపేటకు చెందిన రైతు ఘనత
- ఢిల్లీలో అవార్డు ప్రదానం

చొప్పదండి(రామడుగు) డిసెంబర్ 7: కరీంనగర్ జిల్లా రామడుగు మండలం గోపాల్‌రావుపేటకు చెందిన రామచంద్రారెడ్డికి ఉత్తమ ఉద్యానవన మిలియనీర్ రైతు అవార్డు వరించింది. భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి, కృషి జాగరణ్ సంయుక్తంగా ఏటా మిలీనియం ఫార్మర్స్ మీట్ పేరిట పురస్కారాలు అందిస్తున్నాయి. 2023లో ఈ పురస్కారానికి రామచంద్రారెడ్డిని ఎంపిక చేశాయి. బుధవారం రాత్రి ఆయన ఢిల్లీలో నిర్వహిస్తున్న జాతీయ మేళాలో ఆయనకు కేరళ మాజీ గవర్నర్ సదాశివం, మహేంద్ర గ్రూప్స్ అధినేత రాజమహేంద్ర చేతులమీదు గా అవార్డును అందుకున్నారు. రామచంద్రారెడ్డి 25 సంవత్సరాల నుంచి పంట మార్పిడి చేస్తూ సాగులో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నాడు. బొప్పాయి, డ్రాగన్ ఫ్రూట్, మస్కమిలన్, లిచి, ఊష్ణ యాపిల్, పుచ్చ, దోస లాంటి పంటలు సాగుచేస్తూ అధిక దిగుబడితో పాటు ఏటా లక్షలాది రూపాయల నిఖర ఆదాయాన్ని పొందుతూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. రామచంద్రారెడ్డి సాగు, మార్కెటింగ్, తదితర అంశాలను పరిగణలోకి తీసుకున్న సంస్థ జాతీయ ఉత్తమ రైతు అవార్డుకు ఎంపిక చేశారు. తనకు అవార్డు రావడం సంతోషంగా ఉన్నదని రామచంద్రారెడ్డి చెప్పారు.

# ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి

- ధాన్యానికి రూ. 500 బోనస్ చెల్లించాలి
- ఆడబిడ్డల పెండ్లిళ్లకు రూ. లక్ష, తులం బంగారం ఇవ్వాలి
- జీవన్‌రెడ్డి కాంగ్రెస్‌ను సైతం ప్రశ్నించాలి
- జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

రాయికల్, డిసెంబర్ 7: ఎన్నికల వేళ ఊదర గొట్టిన ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ సర్కారు పక్కాగా అమలు చేయాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం రాయికల్‌లో విలేకరులతో మాట్లాడారు. గ్యారెంటీల విషయంలో జీవన్‌రెడ్డి దేవుడి సమక్షంలో బాండ్ పేపర్ రాసిచ్చారని గుర్తుచేశారు. ప్రశ్నించే గొంతుకని చెప్పుకొనే జీవన్‌రెడ్డి గ్యారెంటీల అమలు కోసం కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించాలన్నారు. ఉమ్మడి పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం తహసీల్, నీటి పన్నును వసూలు చేయగా, తెలంగాణ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ సర్కారు వాటిని రద్దు చేసి రైతులకు రైతు బంధు, రైతు బీమా సౌకర్యం కల్పించిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కౌలు రైతులకు రూ. 12 వేలు, రైతుబంధు ద్వారా రూ. 15వేలు ఇస్తామన్న హామీని అమలు చేసి చూపాలన్నారు. ధాన్యంపై రైతులకు ప్రతి క్వింటాలకు రూ. 500 బోనస్‌ను వెంటనే చెల్లించాలన్నారు. అదేవిధంగా ప్రతి పంటకు కనీస మద్దతు ధరతో పాటు క్వింటాల్‌కు రూ. 500 బోనస్ చెల్లించాలన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం పదిహేను క్వింటాల్ల వరకు మాత్రమే బోనస్ ఇచ్చి రైతులను మోసం చేసిన చత్తీస్‌ఘడ్ సర్కారుకు తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కర్రు కాల్చి వాత పెట్టారని, తెలంగాణ రాష్ట్రంలో ఏ మాత్రం తేడా వచ్చినా రైతులు తగిన గుణపాఠం చెప్పేందుకు వెనుకాడరని హెచ్చరించారు. కాంగ్రెస్ పేదల ఇండ్ల నిర్మాణానికి రూ. 5లక్షలు, గృహజ్యోతి ద్వారా ప్రతీ కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను, రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా నిరుపేదలకు రూ. 10లక్షల కార్పొరేట్ వైద్యాన్ని పక్కాగా అందించాలన్నారు. జగిత్యాల నియోజకవర్గంలో 25వేల మంది బీడీ కార్మికులకు ప్రతీ నెలా రూ. 2వేల జీవన భృతి అందించామని, ఒంటరి మహిళలకు సైతం ప్రతినెలా రూ. 2వేల పెన్షన్ ఇచ్చిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా అర్హులైన ప్రతీ మహిలకు రూ. 2500, రూ. 500కే వంట గ్యాస్ సిలిండర్, పెన్షన్‌లను రూ. 4వేలకు పెంచుతామన్న హామీని వచ్చే నెల నుంచే ఆచరణలో పెట్టాలన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం సౌకర్యాన్ని కల్పిస్తామన్న హామీకి బస్సుల సంఖ్యను పెంచి రూట్లు లేని మార్గాల్లో సైతం బస్సును నడిపించి హామీని పూర్తి చేయాలన్నారు. యువ వికాసం కింద విద్యార్థులకు రూ. 5లక్షల విద్యాభరోసా కార్డు ఇస్తామన్నారని, యువ వికాస్ విషయంలో స్పష్టత ఇవ్వాలన్నారు. అదేవిధంగా ప్రతి మండలంలో ఇంటర్నేషనల్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ డిక్లరేషన్లను సైతం అమలు చేయాలన్నారు. రెండో సారి ఎమ్మెల్యేగా పోటీ చేసిన తనను ఆదరించి ఓట్లు వేసి గెలిపించిన పట్టణ, మండల ప్రజలకు, నాయకులకు, కార్యకర్తలకు, వివిధ హోదాల్లో ఉన్న ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రేవంత్‌రెడ్డి, మంత్రులకు ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, వైస్ చైర్‌పర్సన్ రమాదేవి, ఏఎంసీ చైర్మెన్ రాణి, సింగిల్ విండో చైర్మెన్ మల్లారెడ్డి పాల్గొన్నారు.



మరిమడ్ల ఏకలవ్య గురుకుల పాఠశాల మైదానంలో తలపడుతున్న క్రీడాకారులు

## హోరాహోరీగా..

### మరిమడ్లలో కొనసాగుతున్న రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలు

కోనరావుపేట, డిసెంబర్ 7: మండలంలోని మరిమడ్ల గ్రామ ఏకలవ్య గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలో బాలుర రెండో ఈఎంఆర్‌ఎస్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. మొత్తంగా 23 ఏకలవ్య గురుకుల పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో తలపడుతుండగా రెండో రోజు వివిధ క్రీడల్లో నువ్వానేనా అనేలా ప్రతిభ కనబర్చుతున్నారు. శుక్రవారం క్రీడలు ముగుస్తాయని, గెలుపొందిన జట్లు, క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేస్తామని ప్రిన్సిపాల్ భాస్కర్‌రావు తెలిపారు.

# రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఏర్పాట్లు



మైదానంలో కోర్టు ఏర్పాటుకు కొలతలు తీస్తున్న పీడీలు,పీఈటీలు

- నంది మేడారంలో బాలికల గురుకులంలో పోటీలు
- 9నుంచి12 వరకు నిర్వహణ
- ప్రారంభోత్సవానికి హాజరుకానున్న గురుకుల సొసైటీ కార్యదర్శి నవీన్ నికోలస్
- ఏడు జోన్ల నుంచి హాజరు కానున్న 923 మంది విద్యార్థినులు

ధర్మారం,డిసెంబర్7: నంది మేడారంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంలో ఈ నెల 9 నుంచి 12 వరకు గురుకుల సొసైటీ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి బాలికల క్రీడాపోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు క్రీడాపోటీల వివరాలను ప్రిన్సిపాల్ ఎస్ శైలజ వెల్లడించారు. అండర్-14,అండర్-17,అండర్-19 విభాగాల్లో వేర్వేరుగా విద్యార్థినులకు పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. కబడ్డీ,వాలీబాల్,హ్యాండ్‌బాల్, టెన్నికాయిట్, బాల్ బ్యాడ్మింటన్, చెస్ పోటీలను విభాగాల వారీగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఏడు జోన్ల నుంచి సుమారు 923 మంది పోటీలకు హాజరు కానున్నారు. 100 మంది పీడీలు, పీఈటీలు హాజరై ఆటలు ఆడిస్తారు. కాగా క్రీడాపోటీల నిర్వహణకు గురుకుల విద్యాలయంలోని క్రీడా మైదానంలో ఏర్పాట్లు చేస్తున్నారు. క్రీడా కోర్టులను సిద్ధం చేస్తున్నామని పీడీ సరిత తెలిపారు. ఈ పోటీల ప్రారంభోత్సవానికి గురుకులాల సొసైటీ కార్యదర్శి నవీన్ నికోలస్ హాజరవుతారని వివరించారు.

# దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లి, డిసెంబర్7: దేశీ (డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ సర్వీసెస్ ఫర్ ఇన్‌పుట్ డీలర్స్) ప్రవేశాలు , దేశీ తరగతుల నిర్వహణ కు ఫెసిలిటేటర్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ ద్వారా దేశీ (డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ సర్వీసెస్ ఫర్ ఇన్‌పుట్ డీలర్స్)లో 80 సీట్లకుగాను ప్రవేశాలకుఆసక్తి, అర్హత గల వారు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. జిల్లాలోని ఎరువుల విక్రయాలు, క్రిమి సంహారక లైసెన్స్, పదో తరగతి విద్యార్హత కలిగి ఉన్న డీలర్లు దరఖాస్తు చేసుకోవాలని, ఈ కోర్సులో భాగంగా 48 తరగతులు ప్రతి ఆదివారం ఉం టాయని వివరించారు. జిల్లాలో రెండు దేశీ బ్యాచ్‌లు ఏక కాలంలో నిర్వహించడానికి ఇద్దరు సమన్వయకర్తల (ఫెసిలిటేటర్) కోసం వ్యవసాయ డిగ్రీ/పీజీ పూర్తి చేసి ఐదేళ్లు వ్యవసాయానికి సంబంధించిన రంగంలో పని చేసిన అనుభవం/ వ్యవసాయ శాఖ, కృషి వి జ్ఞాన కేంద్రం, వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 20 ఏళ్లు పనిచేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.వివరాలకు పెద్దపల్లిలోని ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్‌కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. దరఖాస్తులను ప్రభుత్వ పనిదినాలలో సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని మొదటి అంతస్తులో ఈ నెల 16న సాయంత్రం 5 గంటల్లోగా సమర్పించాలని సూచించారు.



# చెప్పలేదనుకునేరహో..

### పల్లెల్లో డప్పు చాటింపునకు తగ్గని ఆదరణ

ఆధునిక సాంకేతిక, సమాచార సాధనలు ఎన్ని వచ్చినా గ్రామాల్లో డప్పు చాటింపు (దండోరా) నేటికీ కొనసాగుతోంది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు, మొదటగా సీఎం కేసీఆర్ కావడంతో కుల వృత్తులకు ప్రాధాన్యత పెరిగింది. ఈ క్రమంలో డప్పు చాటింపు పద్ధతిని నేటికీ పల్లెల్లో కొనసాగిస్తున్నారు. గ్రామాల్లో టాం..టాం.. శబ్ధం వినగానే ప్రజలు ఇండ్ల నుంచి బయటకు వచ్చి సామాచారాన్ని వింటున్నారు. హడావుడిలో వినని వారు డప్పు చాటింపు చేసే వ్యక్తిని పిలిచి మరీ అడిగి విషయం తెల్సుకుంటున్నారు. గ్రామంలో సమావేశాలు, అధికారుల పర్యటనలు, పండుగ విశేశాలు, ప్రభుత్వ పథకాలు వంటి తదితర అంశాలు డప్పు చాటింపు ద్వారా ప్రకటిస్తున్నారు.

\- ఓదెల, డిసెంబర్ 7